తల్లీబిడ్డ ఆరోగ్యానికి రక్షణ



చిన్నారికి నెల సూదులు వేస్తున్న ఏఎన్‌ఎం



గర్భిణికి ఇంజెక్షన్ చేస్తున్న ఏఎన్‌ఎం

ఆదోని సెంట్రల్: జీవన శైలిలో మార్పుల కారణంగా వస్తున్న వ్యాధుల నుంచి తల్లీ బిడ్డలకు రక్షణ కల్పించడంతో పాటు వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలను ప్రజలకు వివరిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదోని మండలంలో గర్భిణులు 2,869 మంది, బాలింతలు 2723 మంది ఉన్నారు. ఏ ఒక్కరూ రక్తహీనతతో బాధపడకూడదని పూర్తి స్థాయిలో ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం బాలింతలు, గర్భిణులు, పిల్లలకు ప్రతి నెలా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తోంది. వారందరికీ పోషకాహారంతో పాటు అవసరమైన మందులను కూడా అందిస్తున్నారు. సంపూర్ణ పోషణ కింద పోషకాహారం అందిస్తున్న సమయంలోనే ప్రతి నెలా గర్భిణులు, పిల్లలకు వారంలో ప్రతి బుధ, శనివారాలలో నెల సూదులు (టీకాలు) వేస్తున్నారు. గతంలో నెల సూది వేసుకోవాలంటే అర్బన్ హెల్త్ సెంటర్‌కు లేదా ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి. ఇప్పుడు అలా గాకుండా అయా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఏఎన్‌ఎంల ద్వారా నెల సూదులు (టీకాలు) వేస్తున్నారు.

బలవర్ధక ఆహారం

ఏ ఒక్కరూ రక్తహీనతతో బాధపడకూడదని ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అములు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి బాలింతలకు, గర్భిణులకు టేక్ హోం రేషన్‌లో భాగంగా సంపూర్ణ పోషణ కింద బియ్యం, కంది పప్పు, అటుకులు, రాగిపిండి, బెల్లం చిక్కీలు, కోడి గుడ్లు, పాలు, ఎండు ఖర్జురాలు వంటివి అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు భోజనంతో పాటు పాలు కోడిగుడ్లను అందిస్తున్నారు. పౌష్టికాహారం తీసుకున్నాక బాధితుల్లో రక్తహీనత తగ్గుతోందా లేదా అనే అంశాలపై కూడా దృష్టి పెట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వారి ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆయా గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్ డాక్టర్లతో పాటు గ్రామ, వార్డు సచివాలయాలకు చెందిన ఏఎన్‌ఎంలు అశా వర్కర్లు పర్యవేక్షించి వారి ఆరోగ్య సమస్యలను అరా తీసి తగిన సలహాలు సూచనలను అందిస్తారు.

పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారు



ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సరకులను అంగన్‌వాడీ టీచర్లు మాకు సక్రమంగా అందిస్తున్నారు. పిల్లలకు కూడా మంచిగా భోజనం పెడుతున్నారు. పిల్లలకు నెల సూది వేసుకోవాలంటే గతంలో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సచివాలయంలోనే నెల సూదులు వేస్తున్నారు. రక్త పరీక్షలు కూడా చేస్తున్నారు. రక్తం తక్కువగా ఉన్న వారిని గుర్తించి మందులు కూడా ఇస్తున్నారు.

– పద్మ, క్రాంతినగర్, ఆదోని

టీకాలు తప్పకుండా వేస్తున్నాం



పుట్టిన ప్రతి బిడ్డకు టీకాలు తప్పనిసరిగా వేస్తున్నాం. ఎవరైనా టీకా వేసుకోని వారుంటే ఇంటి వద్దకు వెళ్లి గుర్తిస్తాం. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు కూడా హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు చేస్తున్నాం. రక్తం తక్కువగా ఉన్న వారికి మా దగ్గర ఉన్న మందులను అందిస్తున్నాం. ప్రమాద లక్షణాలున్న వారిని ఆసుపత్రికి రెఫర్ చేసి వారికి వైద్యసేవలు అందేలా కృషి చేస్తున్నాం. ఏ ఒక్కరు కూడా రక్తహీనతతో బాధపడకూడదని ప్రభుత్వం బలవర్ధకమైన ఆహారం అంగనవాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తోంది. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– నాగమ్మ, ఏఎన్‌ఎం, 18 వార్డు, ఆదోని

క్లుప్తంగా

మరమ్మతు పనుల పరిశీలన



బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకును సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డీఈ రవి కుమార్, ఏఈ రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మరమ్మతు పనుల వల్ల పూర్తిస్థాయిలో రా వాటర్ పంపింగ్ చేయలేని పరిస్థితి నెలకొందని, వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ సుబ్బారాజు

కౌతాళం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్బారాజు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్మాణాల్లో పురోగతి సాధించాలన్నారు. అలాగే గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలు, మరుగుదొడ్ల విషయంలో సమాచారం పూర్తిగా తెలుసుకుని వాటిని పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సాయి అపర్ణ, సరేంద్ర, రోనాల్డ్, సూర్యప్రకాశ్, నళిని, శ్రీనివాసనాయుడు, వీరేష్, జ్యోతిర్మాయి, రాజ్‌కుమార్, షేక్‌గౌస్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



కస్తూర్బా గురుకుల పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జీసీడీఓ

పెద్దకడబూరు: కస్తూర్బా గురుకుల పాఠశాలలో బాలికలకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ) సునీత సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలను సోమవారం ఆమె అకస్మికంగా సందర్శించారు. 10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కష్టపడి చదవి 100 శాతం ఉత్తీర్ణతతో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం పాఠశాల సిబ్బందితో మాట్లాడుతూ.. విద్యార్థినులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళికను రూపొందించుకుని విద్యా బోధన సాగించాలన్నారు. మనబడి నాడు – నేడు పనులను పర్యవేక్షించారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సంబంధిత కాంట్రాక్టర్లు చూడాలన్నారు. ఎంఆర్పీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

అమరప్ప తాత పల్లకీ మహోత్సవం



కౌతాళంలో పల్లకీ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన అమరప్పతాత మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. నిర్వాహకులు అమరేష్ స్వామి ఆధ్వర్యంలో ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున ప్రత్యేక పూజలు సుప్రభాతసేవ, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. అమరప్పతాత చిత్రపటాన్ని గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డాక్టర్ జగదీష్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు శాఖ మేనేజర్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఏరియా ఆసుపత్రి అధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించడానికి ఈ రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేయటం వల్ల మరో ముగ్గురి ప్రాణాలు నిలబెట్టిన వారవుతారని తెలిపారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు 40 మంది రక్తదానం చేశారు. వారికి ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశా రు. ఎన్‌సీసీ అధికారి హవాల్దర్, సుధాకర్‌రెడ్డి, జోనాథన్ వీక్లిఫ్, గోవిందు, ఈరమ్మ, డాక్టర్ నళిని, లక్ష్మన్న, సతీష్‌లు పాల్గొన్నారు.

త్వరలో పుష్కలంగా తాగునీరు



భూగేని చెరువు సమీపంలో జేసీబీతో పనులు చేయిస్తున్న మురళీమోహన్ రెడ్డి

కోసిగి: కోసిగి ప్రాంతానికి త్వరలోనే పుష్కలంగా తాగునీరు అందిస్తామని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి పేర్కొన్నారు. కోసిగిలో తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన భూగేని చెరువులోకి పులికనుమ పైప్‌లైన్ నుంచి తుంగభద్ర నది నీరు చేరడంతో నిండుగా కళకళాడుతోంది. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు భూగేని చెరువును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ కింద రూ.1.74 కోట్లతో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, రంగప్ప గట్టు వద్ద, 3వ వార్డు అంగన్ వాడీ సెంటర్ వద్ద రెండు ట్యాంక్‌లు ఏర్పాటు చేయనునట్లు తెలిపారు. రంగప్ప గట్టు వద్ద భూమి పూజ చేసి జేసీబీతో ట్యాంక్ పనులు ప్రారంభించారు. త్వరలోనే భూగేని చెరువులో ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే కోసిగిలోని మైనార్టీ కాలనీకి వెళ్లేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.17.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో చేయించాలని కాంట్రాక్టర్ బసిరెడ్డికి సూచించారు. ఎంపీపీ ఈరన్న, నాడుగేని నరసింహులు, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, నరసింహులు, బుడగ జంగాల అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



మదిరె వద్ద ఎస్‌ఎస్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిరూరల్: తాగునీటి సమస్య పరిష్కారానికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నట్లు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మదిరె గ్రామ సమీపంలో సీడబ్ల్యూఎస్ స్కీం నాబార్డు కింద రూ.5 కోట్లు, జేజేఎం నిధులు రూ.కోటితో నిర్మించిన ఎస్‌ఎస్ ట్యాంకు, నీటిశుద్ధి ప్లాంటు, సంపులను ఆయన పూజ చేసి ప్రారంభించారు. ఎల్లెల్సీ కాలువ ద్వారా నీటిని తోడుకొని ఎస్‌ఎస్ ట్యాంకు నింపేందుకు ఏర్పాటు చేసిన మోటార్‌లను బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నహరివాణం పొలాల్లో 11 ఎకరాల్లో రూ.6 కోట్లతో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మించినట్లు చెప్పారు. ఈ ట్యాంకు ద్వారా నాలుగు గ్రామాలకు సమృద్ధిగా నీరు అందుతుందన్నారు. ప్రస్తుతం మదిరె గ్రామానికి పైపులైన్ పూర్తయ్యిందని, త్వరలో రూ.76 లక్షలతో చిన్న హరివాణం, చిన్నగొనేహాల్ గ్రామానికి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. పెద్దహరివాణం, సంతెకూడ్లూరు గ్రామాలకు పైపులైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంపాపతి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఆనంద్, నారాయణ, రాముడు, రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శివనాగేశ్వరరావు, ఏఈ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

ఆదోనిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు.

స్పందనలో అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని..

- హొళగుంద మండలం మద్దిలింగదమ్మి గ్రామంలో బస్సు వెళ్లే మార్గంలో స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఉన్నాయని, విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అర్జీ సమర్పించారు.
- ఆదోని పట్టణం పంచరాపోల్‌కు చెందిన నాగరాజుకు సంబంధించి సర్వే నంబర్ 369లో 44 సెంట్లు భూమి తమ పెద్దల నుంచి సంక్రమించిందని, ప్రస్తుతం సదరు భూమి ఆక్రమణకు గురైందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని పట్టణం శివశంకర్ నగర్, మహాత్మాగాంధీ నగర్ వార్డుల్లో నిర్మించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు అర్జీ సమర్పించారు.



అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీయల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఉప తహసీల్దార్లు వలీబాషా, కౌసర్‌బాను, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సకాలంలో పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ వార్డులకు చెందిన ప్రజలు సమస్యలపై కమిషనర్‌కు దరఖాస్తులు అందజేశారు. ఎన్‌జీవోస్ కాలనీలో వాటర్ సంపునకు మరమ్మతులు చేయాలని, రంధ్రాలు పడడం వల్ల ఆటలాడుకుంటూ పిల్లలు సంపులో పడే అవకాశం ఉందని ఈరన్న, లక్ష్మన్న, తిప్పన్న వివరిస్తూ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. సంపులో రంధ్రాలు పడి ఉండడం వల్ల విష పురుగుల సంచారం, పిల్లులు, పందులు, కుక్కలు సైతం సంపు చుట్టే తిరుగుతాయని, ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించారు. శివారు ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు, తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని పలువురు దరఖాస్తులను అందజేశారు. వైఎస్సార్ నగర్, కేవీఆర్ కాలనీల్లో, తిమ్మారెడ్డి బస్టాండు ఏరియాల్లో ఆస్తి పన్ను విధించాలని ఇద్దరు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్, రెవెన్యూ, ఎలక్ట్రికల్, వైకేపీ మెప్మా, టీపీఓ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

రణమండల కొండలో దీపోత్సవం

ఆదోనిఅర్బన్: కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా పట్టణ శివారులోని రణమండలకొండలో దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. కొండ అంతా జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగింది. సోమవారం తెల్లవారుజామున భక్తులు కొండకు ఇరువైపులా కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు ఏర్పాటు చేసిన దీపాన్ని వెలిగించారు. కొండ ప్రాంతమంతా దీపాలతో కళకళలాడింది. అనంతరం రణమండల ఆంజనేయస్వామికి ఫల పంచామృతాభిషేకం, సింధూర సేవ, తులసీహారం, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పూలతో అలంకరించి నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ, సేవాసమితి సభ్యులు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలయాల్లో కార్తీక పౌర్ణమి శోభ

ఆదోనిరూరల్: మండలంలోని విరుపాపురం గ్రామంలో శ్రీగిరి కొండల్లో స్వయంభూగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి, సప్తలింగేశ్వర స్వాము లకు, జమ్మి మహాదేవికి భక్తులు కార్తీక పౌర్ణమి పూజలను సోమవారం నిర్వహించారు. నిర్వాహకులు ఈరన్న ఆధ్వర్యంలో భక్తులు స్వామిఅమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీగిరి ఈరన్న మహత్యంతో సకల కష్టాలు, దోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రాలయం: మండలంలో ఊరూరా కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామాల్లోని శివాలయాలు, వైష్ణవ క్షేత్రాలు కార్తీక పౌర్ణమి వేడుకలతో కళకళలాడాయి. మండలంలోని మాలపల్లి, మాధవరం, చెట్నేహళ్లి, సుంకేశ్వరి, రాంపురం, రచ్చుమర్రి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు వేకువజామున నుంచే పూజల్లో తరలించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



పూజలందుకున్న జమ్మి మహాదేవి



మంత్రాలయం రామలింగేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఉరుకుందలో భక్తజన సందడి



ఈరన్న స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది. కార్తీక మాసంలో రెండవ సోమవారం కావడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శంచుకునేందుకు వేలాదిగా తరలివచ్చారు. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. పలువురు భక్తులు కార్తీక దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. కొందరు పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు. కౌతాళం పోలీసులు గట్టి బందబస్తు ఏర్పాటు చేశారు.

ఈరన్న స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే

ఉరుకుంద ఈరన్న స్వామిని సోమవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అసిస్టెంట్ కమిషనర్ వాణి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. రూ.1.28 కోట్లతో జరుగుతున్న బండపరుపు పనులను పరిశీలించి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. అనంతరం బుదుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో, ఎరిగేరి గ్రామంలో వెలసిన పులిగట్టు ఆంజినేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, బంటకుంట సర్పంచ్ గోపాల్‌రెడ్డి తదితరులు వెంట ఉన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కార్తీక సహస్ర దీపారాధన

కౌతాళం: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో సహస్ర దీపారాధనను సోమవారం రాత్రి నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అధ్వర్యంలో వేద పండితులు, ప్రత్యేక పూజలు చేసి దీపాలను వెలిగించారు. భక్తులు పెద్దసంఖ్యలో దీపాలువెలిగించి భక్తిని చాటుకున్నారు.



కోసిగిలో అలంకరణలో షిరిడీ సాయిబాబా

కోసిగి: మండలంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్త మార్కండేయ స్వామి ఆలయంలో అర్చకులు వీరేష్ స్వామి ఆధ్వర్యంలో వేకువజామున నుంచి స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజలు నిర్వహించారు. జంపాపురం బసవేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి స్వామివారికి హారతులు పట్టి పూజలు చేశారు. కోసిగి ఉరుకుంద క్రాస్ రోడ్డులో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో పురోహిత్ గట్టు రమేష్, సాయి సేవక్ పాండు రంగ ఆధ్వర్యంలో కాగడ హారతి, అభిషేకాలు, ఫలపుష్పాలంకరణలు గావించి మహా మంగళ హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉచిత సాయి సమూహిక సత్యవ్రతాలు చేశారు. అనంతరం బాబా చిత్రపటాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం బాబా మందిరం , మార్కండేయ స్వామి ఆలయం ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించారు.

మంత్రాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



దీపం.. దేదీప్యమానం

మంత్రాలయం: శ్రీమఠంలో సోమవారం రాత్రి తుంగభద్రమ్మ పుణ్యహారతి, లక్ష దీపోత్సవంతో కనువిందు చేసింది. వేలాదిగా భక్తులు తరలివచ్చి కార్తీక పౌర్ణమి వేడుకలో తరించారు. కోలాటాలు, దాసవాణి, భక్తజనుల కోలాహలంతో నదీతీరం సందడిగా మారింది. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో తుంగా హారతి వేడుక కనువిందు చేసింది.



తుంగభద్ర నదిలో జ్యోతులు వదులుతున్న భక్తులు



కోలాటం ప్రదర్శనలో మహిళలు

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన

ఆదోనిరూరల్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డీప్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.మాలిక్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రెడ్ రిబ్బన్ క్లబ్ ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఆదోని పట్టణంలోని నేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. ప్రాజెక్ట్ మేనేజర్ కె.మాలిక్, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు చూడరాదన్నారు. ఆర్‌డీప్ సిబ్బంది రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో తప్పిపోయి ముంబైలో ప్రత్యక్షం



రాకేష్

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఎల్‌ఐజీ కాలనీకి చెందిన రంగప్ప కుమారుడు రాకేష్ (12) ఆదివారం మధ్యాహ్నం తప్పిపోయి సోమవారం సాయంత్రం ముంబైలో ప్రత్యక్షమయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు పట్టణమంతా గాలించారు. తుదకు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం బాలుడు తాను ముంబైలో ఉన్నానని తండ్రికి ఫోన్ చేయడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. తండ్రి రంగప్ప మాట్లాడుతూ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైలు ఎక్కి ముంబైకి వెళ్లిపోయాడని, తమ కుమారుడిని ఎవరూ ఏమీ అనలేదని చెప్పారు. ముంబైలో ఓ ఆటోవాలతో తనకు ఫోన్ చేయించాడని, వెంటనే అతనికి బాలుడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి వెళ్లిపోవాలని చెప్పామన్నారు. తన అన్న కుమారుడు బెంగళూరు నుంచి ముంబై వెళ్లి అక్కడ పోలీస్‌స్టేషన్‌లో తమ కుమారుడిని పిలుచుకొని వస్తున్నట్లు చెప్పారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిరూరల్: మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వీరన్న, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం వారు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు.